ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

గురువారం 1 మే 2025



381 కేంద్రాల్లో 'నీట్' నిర్వహణకు ఏర్పాట్లు

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్యవిద్యాకోర్సుల్లో ప్రవేశానికై జరిగే 'నీట్'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మే 4న, రాష్ట్రవ్యాప్తంగా 381 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 1.49లక్షలమంది విద్యార్థులు పాల్గొననున్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు మధ్యాహ్నం 11 గంటలనుంచి 1.30 గంటలలోపుగా చేరుకునేందుకు వెసలుబాటు ఉంది. 2 గంటలనుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు మే 1నుంచి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా గుర్తింపుకార్డు తెచ్చుకోవాల్సి ఉంటుంది.



చాలుక్య సర్కిల్‌లో బసవణ్ణ విగ్రహానికి సీఎం నివాళి



కర్మ సిద్ధాంతాన్ని.. వీడాలి..!

- అప్పుడే బసవణ్ణ తత్వాలు బోధపడతాయి
- పురస్కారాల ప్రదానోత్సవంలో సీఎం



విధానసౌధ వద్ద విద్యుత్ కాంతుల్లో బసవేశ్వరుడి విగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కర్మ సిద్ధాంతాన్ని, తలరాతను నమ్మేవారు బసవ తత్వాలు అర్థం చేసుకోలేరని, మూఢాచారాలు వీడితేనే పరిపూర్ణ జ్ఞానం సాధ్యమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. బసవణ్ణ కాయకవే కైలాశం అని, సమానత్వం ఆశించారని, కులమతాలతో సంబంధం లేని సమాజం కోసం పాటుపడ్డారన్నారు. కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో కూడలసంగమలో బుధవారం ఏర్పాటు చేసిన శరణవైభవ 2025 వేడుకలను ప్రారంభించిన సీఎం బసవశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో చర్చ ఉంటుందని, నియంతృత్వంలో తాను చెప్పిందే వినాలనే ధోరణి ఉంటుందన్నారు. మన్ కీ బాత్‌లో చర్చలేదని, కేవలం ఏకాభిప్రాయమే ఉందని పరోక్షంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని విమర్శించారు. బసవతత్వాలను వ్యతిరేకించేవారు భిన్నమైనవారన్నారు. వచనమంటే మాట అని, శరణ వచన అంటే ప్రజలభాషలో భాగమన్నారు. అందుకే వచన సాహిత్యం ప్రజల సాహిత్యంగా ఉందన్నారు. మన రాజ్యాంగానికి ప్రత్యేక శక్తి ఉందన్నారు. అందుకే పౌర కార్మికుడైనా, రాష్ట్రపతికి అయినా ఒకే ఓటు ఉంటుందన్నారు. బసవణ్ణను అర్థం చేసుకోవాలంటే ముందు కర్మసిద్ధాంతాన్ని తలరాత అనే మూఢనమ్మకాలను వీడాలన్నారు. బసవణ్ణ ఆశయాలు, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని నైతిక విలువలు ఒక్కటే అన్నారు. గోరుచ సమితి ద్వారా అనుభవమంటపం నిర్మించే ప్రక్రియ మా పాలనలోనే ప్రారంభమైందన్నారు. ఈ ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. బసవణ్ణను సాంస్కృతిక నాయక అని ప్రకటించింది మేమే అన్నారు, అక్కమహాదేవి పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. కనకదాసు, బసవణ్ణలో సంస్కృతంలో ఏమీ చెప్పలేదని, ప్రజలకు అర్థమయ్యే రీతిలోనే వారి భాషలోనే ప్రచారం చేశారన్నారు. ప్రజాస్వామ్యం పుట్టింది ఇంగ్లండ్‌లో కాదని, 900ఏళ్లకిందట అనుభవమంటపం నుంచే అన్నారు. మంత్రులు ఎంబీ పాటిల్, ఆర్‌బీ తిమ్మాపుర, శివరాజ్ తంగడగిలు పాల్గొన్నారు.



కూడలసంగమ కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య తదితరులు

ఉగ్రవాదానికి విముక్తి పలకాలి

పాకిస్థాన్‌పై యుద్ధం అనివార్యమైతే చేయవచ్చునని, అయితే ఉగ్రవాదానికి ముక్తి పలకాలని సీఎం సిద్దరామయ్య అన్నారు. బాగల్కోటెలో మీడియాతో మాట్లాడుతూ 1971లో పాకిస్థాన్‌పై అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ యుద్ధం చేసి మట్టుబెట్టారన్నారు. పాకిస్థాన్‌కు చెందిన 80వేలమంది సైనికులు శరణు కోరారన్నారు. కాగా కాంగ్రెస్ 'ఎక్స్'లో ప్రధాని మోదీకి తలలేకుండా పోస్ట్ చేయడంపై అభ్యంతరం తెలిపారు. వాక్ స్వాతంత్ర్యం ఉందని మరొకరి మర్యాద తీసేలా ప్రవర్తించడం సరికాదన్నారు. ఉగ్రవాదుల దాడి తర్వాత కేంద్రప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు తమ మద్దతు ఉంటుందన్నారు.

వివాహం..వివాదం..!

- తాళికట్టే వేళ.. వరుడు తిరస్కారం
- పెళ్లిమండపంలో గందరగోళం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు

విజయపుర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తాళి కట్టే వేళ పెళ్లికొడుకు నిర్ణయం మార్చుకున్నారు. పెళ్లి కూతురుపై అనుమానం ఉంది..పెళ్లి వద్దేవద్దంటు తిరస్కరించాడు. కొన్ని నెలల కిందటే ఇరుకుటుంబాలు పెళ్లికి అంగీకరించాయి. నిశ్చితార్థం జరిగింది. ముహూర్తాలు కుదుర్చుకున్నారు. మంగళవారం రాత్రి రిసెప్షన్ వేడుకలు వైభవంగా సాగాయి. వధూవరులు ఉత్సాహంగా గడిపారు. బుధవారం ఉదయం మరికాసేపట్లో వధువు మెడలో తాళి కట్టాల్సి ఉంది. అంతలోనే వరుడు తిరస్కరించాడు. యువతిపై అనుమానం ఉందంటూ కొత్త అంశాన్ని లేవనెత్తాడు. దీంతో కల్యాణమండపంలో గందరగోళం నెలకొంది. వధువు తరఫు బంధువులు ముందుగా నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత వాగ్వాదం చోటు చేసుకున్న సంఘటన బెంగళూరు శివారు దేవనహళ్ళి తాలూకా బాలేపుర గ్రామంలోని కల్యాణమండపంలో జరిగింది. వధువు మరో యువకుడిని ప్రేమించిందని వరుడు అభ్యంతరం తెలిపారు. ఈ విషయాన్ని పెళ్లికి ముందే చెప్పామని, అది కేవలం స్నేహమేనని వధువు తరఫు బంధువులు వాపోయారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో వధువు బంధువులు చన్నరాయపట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





బీబీఎంపీ చీఫ్ కమిషనర్‌గా మహేశ్వర్‌రావు బాధ్యతలు

తుషార్ గిరినాథ్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తూ..

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ చీఫ్ కమిషనర్‌గా మహేశ్వర్‌రావు బాధ్యతలు చేపట్టారు. బుధవారం బీబీఎంపీ కార్యాలయంలో కొన్నేళ్లకాలంగా ముఖ్యకమిషనర్‌గా వ్యవహరించిన తుషార్ గిరినాథ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కాగా బీబీఎంపీ కమిషనర్‌గా కొనసాగిన తుషార్ గిరినాథ్ పాలనాధికారిగా కొనసాగనున్నారు. కార్యక్రమంలో స్పెషల్ కమిషనర్‌లు అవినాశ్ మీనన్, రాజేంద్రన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

సంబరాలు.. డబుల్..!

- రెండేళ్ల పాలనా వేడులకు సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- హోస్పేటలో నిర్వహించాలని పార్టీలో తీర్మానం
- చరిత్రలో నిలిచిపోయేలా లక్ష కుటుంబాలకు హక్కు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు

బెంగళూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా భారీగా కార్యక్రమాలు చేసేందుకు కసరత్తు సాగుతోంది. విజయనగర జిల్లా కేంద్రం హోస్పేటలో రెండేళ్ల వేడుక నిర్వహించాలని తీర్మానించారు. ఇప్పటికే రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లులేని వారికి పట్టాలను ప్రదానం చేయాలని తీర్మానించారు. రెవెన్యూ గ్రామాలతో సంబంధం లేని తండాలు, హట్టి, హాడి ప్రాంతాలలో నివసిస్తూ ప్రభుత్వ సౌలభ్యాలు పొందలేనివారి కోసం రెండేళ్ల సంబరాల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా రెవెన్యూ గ్రామాలుగా మార్చాలని నిర్ణయించారు. శాశ్వత పద్ధతిన అదే రోజున లక్ష కుటుంబాలకు హక్కుపత్రాలు ఇవ్వనున్నారు. ఏడాదిలోగా 2 లక్షల కుటుంబాలకు హక్కుపత్రాలు ఇచ్చేలా జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని తీర్మానించారు. ఇప్పటివరకు ఇంటి పట్టాలు ఇచ్చినా వాటికి తగిన గుర్తింపు లేకపోవడం, స్థానిక సంస్థల ద్వారా అమలు చేసినా పట్టాకు తగిన ఖాతాలు, వివరాలు సమగ్రంగా నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల స్థలం లేదని మళ్లీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఇలా దశాబ్దాలుగా కొందరికి నాలుగైదుసార్లు పట్టాలు మంజూరైనా స్థలం చూపకపోవడంతో పాటు వారు ఇంటిని నిర్మించుకునే పరిస్థితి లేకుం డా పోయింది. దీంతో శాశ్వత విధానం ఉండాలని, డిజిటల్ హక్కుపత్రాలను ఇవ్వనున్నారు. త ద్వారా సదరు పట్టా మార్పిడిగానే మరో అవకాశం ఉండదు. గ్రామీణ ప్రాంతాలలో అక్రమ లే అవుట్‌లను గుర్తించి పన్నులు వసూలు చేసేలా జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీంతో ఏ పల్లెకు చెందినవారైనా సొంతింటి కల సాకారం ఆలస్యమైనా, ఇంటి పట్టా మాత్రం వెంటనే ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.



ఉత్తమ పాలనకే ప్రాధాన్యం

సీఎం సిద్దరామయ్య రెండేళ్ల పాలన సంబరాల తరహాలో కాకుండా ఉత్తమ పాలన అందించేలా కార్యక్రమాలు రూపొందించనున్నారు. 2023లో శాసనసభ ఎన్నికలు జరగగా కాంగ్రెస్ పార్టీకి అనూహ్యమైన మెజారిటీ సాధ్యమైంది. సీఎంగా సిద్దరామయ్య రెండోసారి పగ్గాలు చేపట్టారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఐదు గ్యారెంటీలను అమలు చేశారు. గ్యారెంటీల విజయోత్సవాలు చేసుకున్నారు, కానీ తొలి ఏడాది సంబరాలకు అవకాశం లేకుండా పోయింది. అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సంబరాలు చేసుకోలేకపోయారు. ఈ ఏడాది సంబరాలకు అవకాశం ఉన్నా ముఖ్యమంత్రి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దేశంలో ఉద్రిక్త పరిస్థితి ఉన్నందున సంబరాలు చేసుకోవాలా అనే మీమాంసలో ఉన్నారు. పహల్గాంలో ఉగ్రదాడిలో 26మంది పర్యాటకులు మృతి చెందిన నేపథ్యంలో సంబరాలకు సమంజసమేనా అనే చర్చ కూడా పార్టీలో సాగుతోంది.



కబ్బన్‌పార్కులో తడిసిన సందర్శకులు

గొడుగులతో పరుగులు తీస్తున్న మహిళలు

బెంగళూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో కబ్బన్ పార్క్‌లో సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బసవజయంతి నేపథ్యంలో పార్కుకు సందర్శకులు పెరిగారు. దాదాపు అరగంట వర్షం కురిసింది. మహిళలు గొడుగులను ఆశ్రయించగా మరికొందరు సమీపంలోని బాలభవన్‌లో తలదాచుకునేందుకు పరుగులు తీశారు.

భూదేవి అలంకరణలో వాసవీదేవి



అలంకరణలో వాసవీ మాత

దొడ్డపేటలో కొలువైన వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో 17వ వార్షిక వాసవి జయంతిని పురస్కరించుకుని బుధవారం భూదేవి అలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. విద్యుత్ దీపాల అలంకరణ ఆకట్టుకుంది. వాసవి జయంతి వరకు అలంకరణ కొనసాగనుంది. (చింతామణి, ఆంధ్రజ్యోతి)

తగ్గిన పూల ధరలు ఆందోళనలో రైతులు

8

మహా మానవతావాది బసవేశ్వరుడు

- తత్వ బోధనలతో చైతన్యం కలిగించిన సాహితీవేత్త: డీసీ మిశ్రా
- బళ్లారి, విజయనగరం జిల్లాల్లో ఘనంగా జయంతి వేడుకలు


ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యాంశంగా హంపి బజార్


- రాయల కాలంలో వజ్రవైఢూర్యాలు అమ్మింది ఇక్కడే
- 1980లోనే యునెస్కో గుర్తింపు పొందిన కట్టడం

బళ్లారి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యంలో వాణిజ్య వైభవాన్ని చాటి చెప్పిన హంపి మార్కెట్‌కు మరో కీలక స్థానం దక్కింది. మార్కెట్ ప్రాధాన్యం వివరిస్తూ ఏడోతరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో "హంపి బజార్" పాఠ్యాంశంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో చేర్చారు. 2025-26 జూన్ విద్యాఏడాది నుంచి అభ్యాస అంశంగా చేర్చారు. ఈ పాఠ్యాంశంలోని 12వ అధ్యాయం మార్కెట్లను అర్థం చేసుకొవడం అనే శీర్షికతో ఉంటుంది. మార్కెట్ అంటే ఏమిటి, అక్కడ ఏలాంటి లావాదేవీలు జరుగుతాయి. డిమాండ్, సరఫరా, అధిక ధరలు, తక్కువధరలు, కిరాణా దుకాణాలు, మాల్స్, అన్‌లూన్ మార్కెటింగ్, అలాగే అన్నిరకాల ఇతర అంశాలను ఇందులో పొందుపరిచారు. అంతర్జాతీయ వాణిజ్యం, ఎగుమతిదిగుమతులు, మొదలైన వాటితో సహ చాలా మంది పాఠ్యాంశంలో చేర్చారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ విద్యార్థులు నేర్చుకోగలిగేందుకు సమాచారం ఉంచారు.

- విజయనగర సామ్రాజ్యం హంపి లోని విరుపాక్షేశ్వరస్వామి దేవాలయం ముందు ఉన్న మండపాల వరుస ఒక ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా ఉండేది. ముందు బాగంలో బసవన్న మంటపం, వెనుక బాగంలో మాతంగ కొండల ధ్య ఉన్న మడపాల వరుసలను వర్ణించే ఆకర్షణీయమైన చిత్రం వచనంతో పాటు అందించబడింది.
- భారతీయ మార్కెట్ వ్యవస్థ గురించి నేర్చుకునేటప్పుడు మొదట 16వ శతాబ్దంలో మార్కెట్ ఏలా ఉండేదో అర్థం చేసుకోవాలి. విజయనగర కాలంలో మార్కెట్ ఏలా ఉండేదో చాలా మంది విదేశీ పర్యాటకులు వివరించారు. అందువల్ల దేశ చరిత్రలో మార్కెట్ అంశం విషయానికి వస్తే హంపి బజార్ గురించి ప్రస్తావించకుండా ఉండటం అసాధ్యం హంపి మార్కెట్లో ఆహార వస్తువులే కాకుండా వజ్రాలు, వైఢూర్యాలు, అమ్మకాలు సాగించేవారు. దేశ వ్యాప్తంగా 30,822 సీబీఈఎస్ఈ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఈ పాఠ్యాంశం ఉంటుంది. జూన్ నుంచి ఇది కొత్తగా బోధించనున్నారు. 1980లో యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

విజయనగర రాజుల కాలం నాటి హంపి మార్కెట్ ఇదే





వైభవంగా బసవేశ్వర జయంతి

నగరోత్సవంలో అబ్బురపరిచిన ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి 919వ జయంతి వేడుకలను జిల్లా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నగరంలోని క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి మీదుగా పాతూరులోని పేట బసవేశ్వరస్వామి ఆలయం వరకు నగరోత్సవం నిర్వహించారు. శివుడు, వీరభద్రస్వామి వేషధారణలు, నందికోళ్ల కళా ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, విన్యాసాలు అబ్బురపరిచాయి.

- క్లాక్‌టవర్ సమీపంలోని బసవేశ్వరస్వామి విగ్రహానికి వీరశైవ మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి పూలమాలలు వేశారు. 12వ శతాబ్దంలోనే సమ సమాజ స్థాపనకు కృషిచేసిన జగజ్యోతి బసవేశ్వరస్వామి అని ఆయన అన్నారు. విశ్వగురువు, మహాయోగి బసవేశ్వరుడు చూపిన మార్గం యావత్ ప్రపంచం ఆచరించదగ్గదని అన్నారు.
- ప్రతి సంవత్సరం వైశాఖ మాస శుక్లపక్షం రోజున బసవేశ్వరుని జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ఎంజీ రాజు అన్నారు. బసవేశ్వరుడి వచనాలు మానవత్వానికి ప్రతీకలని, ఆయన నడిచిన మార్గంలో మనమందరం నడుద్దామని పిలుపునిచ్చారు. జిల్లా వీరశైవ సమాజం ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగన్న, కోశాధికారి మల్లికార్జున, మఠం తిప్పేస్వామి, ధనుంజయబాబు, సుశీల, ఇందిరా, లింగేశ్వరి, చంద్రశేఖర్, బిదుకార్ గంగాధర్, నాగార్జున, వీరేష్, రవికుమార్, శివకోటి రాంభూపాల్, చిరంజీవి, విజయ్‌కుమార్ చౌదరి, సుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


బసవేశ్వర జయంతి వేడుకల్లో వీరశైవులు




శివ తాండవం చేస్తున్న కళాకారుడు.. విన్యాసం చేస్తున్న వీరభద్రుడి వేషధారి



మనిషి రూపంలో ఉన్న దేవుడు బసవేశ్వరుడు : కలెక్టర్


బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మనిషి రూపంలో ఉన్న దేవుడు బసవేశ్వరుడని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. బసవేశ్వరుడి జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేసి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. కలెక్టరు మాట్లాడుతూ బసవేశ్వరుడు ఊరూరు తిరుగుతూ సమాజాన్ని సరిదిద్దే కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కవిగా, తాత్వికుడిగా, గురువుగా, సాంఘిక సంస్కర్తగా సమాజంలో కీర్తించబడ్డారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా సమాజశ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడ్డారన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని కలెక్టరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు యుగేశ్వరి, అలెగ్జాండర్, వసంతలత తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైతే పాకిస్థాన్‌కే వెళ్లిపోవచ్చు



- ఇక్కడ తిని.. వారిని పొగుడుతారా?
- ఉగ్రవాదులకు నరకం తప్పదు
- గణపతి సచ్చిదానందస్వామి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'దేశంలో మారణహోమాన్ని సృష్టిస్తున్న పాకిస్థాన్ మంచిదేనని ఇప్పటికీ మనదేశంలో కొందరు పేర్కొనడం శోచనీయం. పాకిస్థాన్‌పై అంతటి ఇష్టం ఉన్నపుడు వారు కూడా దేశాన్ని వదిలి పాకిస్థాన్‌కు వెళ్లిపోవచ్చు' అని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీ అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని దత్తమందిరంలో బుధవారం నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఘటనపై స్పందించారు. భూతల స్వర్గమైన కశ్మీర్ అందాలను వీక్షించేందుకు వెళ్లిన పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం దుర్మార్గమని అన్నారు. ధర్మం అడిగి చంపడం మనసుకు చాలా బాధ కలిగిస్తోందని, గతంలో ధర్మం విషయంలో చంపడమనేది ఎక్కడా జరగలేదని అన్నారు. కొత్తగా వివాహ బంధంతో ఒక్కటైన జంటలు విహారయాత్రకు వెళితే.. నవ వధువు కళ్లముందే భర్తను కాల్చి చంపడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ దారుణానికి పాల్పడినవారిని భారత ప్రభుత్వం వీలైనంత త్వరగా శిక్షించాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. దాయాది దేశస్థులకు స్నేహముండాలే తప్ప క్రోధముండకూడదని అన్నారు. ఈ దేశానికి చెందినవారే కొందరు ఈ దేశం తిండి తింటూ, ఇక్కడి నీళ్లు తాగుతూ, ఇక్కడ గాలి పీలుస్తూ పాకిస్థాన్‌ను పొగుడుతూ, భారతీయుల మనసులను ఎందుకు కష్టపెడుతున్నారో వారికే తెలియాలని అన్నారు. మనం శాంతియుతంగా శాంతి, ధర్మాన్ని అనుసరిస్తుంటే పాకిస్థానీయులు మనల్ని తక్కువ అంచనా వేస్తున్నారని అన్నారు. మనం ఏ ధర్మంలో పుట్టామో చచ్చే వరకూ అదే ధర్మాన్నే అనుసరించాలి తప్ప వేరే ధర్మానికి మారకూడదని, దీనిని భావితరాలకూ నేర్పాలని సూచించారు. మనలో రాగద్వేషాలు, కోపతాపాలు లేకుండా అంతరూ కలిసికట్టుగా ధర్మ రక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. భారతీయులను బాధకు గురిచేసే పాకిస్థానీయులకు తప్పకుండా దేవుడు నరకప్రాప్తి కలిగిస్తాడని అన్నారు.

అక్షయ విశ్వాసం

కిటకిటలాడిన బంగారం దుకాణాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


దుకాణంలో ఆభరణాలు ధరించి.. ఆనందంగా..

అనంతపురంలోని ఓ దుకాణంలో సందడి



బంగారు ఆభరణాల దుకాణాలు బుధవారం కళకళలాడాయి. అక్షయ తృతీయను పురస్కరించుకుని జిల్లా ప్రజలు బంగారాన్ని కొనేందుకు ఎగబడ్డారు. సాధారణంగా ఉదయం 10 గంటల తరువాత తెరుచుకునే దుకాణాలను వ్యాపారులు గంట ముందుగానే తెరిచారు. కొత్త కొత్త డిజైన్లు, ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బంగారం ధరలు భారీగా ఉన్నా.. ఈ రోజున కొంటే సంపద పెరుగుతుందన్న విశ్వాసంతో చాలామంది తమకు వీలైనంత కొనుగోలు చేశారు. సందడి ఎంతున్నా.. ఈ ఏడాది వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేవని వ్యాపారులు అన్నారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతపురం హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి, అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పుష్పార్చనలు, సామూహిక అనంత ఐశ్వర్యేశ్వర స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు. సాయంత్రం స్వామివారి కీర్తనలు ఆలపించారు. భజన చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్


కౌంటర్లన్నీ బిజీ బిజీ


హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో అనంత ఐశ్వర్యేశ్వర స్వామి

పాలిసెట్ ప్రశాంతం

88.69 శాతం హాజరు

ఆలస్యంగా వచ్చినవారికి నో ఎంట్రీ

సెంటర్ల వద్ద ప్రైవేటు కాలేజీల వేట




హమ్మయ్య పరీక్ష రాసేశాం అంటూ బయటకు వస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్-2025 పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 88.69 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 14,242 మంది దరఖాస్తు చేసుకోగా, 12,632 మంది హాజరయ్యారని సెట్ సమన్వయకర్తలు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన కొందరు విద్యార్థులకు అనుమతి లభించలేదు. దీంతో నిరాశగా వెనుదిరిగారు. హడావుడిలో కొందరు హాల్‌టిక్కెట్స్, పెన్సిల్, ఎరేజర్లను తెచ్చుకోవడం మరచిపోయారు. పరీక్షా కేంద్రాలవద్దకు వచ్చి కంగారుపడ్డారు. సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్లకు వెళ్లి హాల్ టిక్కెట్స్ తెచ్చుకున్నారు. పెన్సిల్, ఎరేజర్లను పరీక్ష కేంద్రాల వద్ద కొందరు సిబ్బంది, ఇతరులు సమకూర్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు, వైద్య సిబ్బందిని ప్రభుత్వం అందుబాటులో పెట్టింది.

ఆలస్యం.. మరిచిపోయాం..

పరీక్ష ఉదయం 11 గంటలకు కాగా, చాలామంది విద్యార్థులు 9 గంటల నుంచే కేంద్రాలకు వచ్చారు. అధికారులు, సిబ్బంది హాల్ టిక్కెట్‌లను పరిశీలించి గదుల్లోకి అనుమతించారు. కొందరు 11 గంటలు దాటిన తరువాత వచ్చారు. అప్పటికే పరీక్ష మొదలైంది. రెండు, మూడు నిమిషాలు మాత్రమే మినహాయింపునిచ్చి అనుమతించారు. ఆ తరువాత వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు. విభిన్న ప్రతిభావంతులు తొమ్మిదో తరగతి విద్యార్థులను స్క్రైబ్‌గా తెచ్చుకున్నారు. సదరం సర్టిఫికెట్స్‌లో తక్కువశాతం వైకల్యం ఉన్నవారికి, రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి స్క్రైబ్‌ను అధికారులు అనుమతించలేదు.

అప్పుడే వేట..

పరీక్షా కేంద్రాల వద్ద ప్రైవేట్ విద్యాసంస్థల సిబ్బంది విద్యార్థుల వివరాలను సేకరించారు. తమ కాలేజీలలో చేరాలని ఎర వేస్తూ కనిపించారు. చదువు, హాస్టల్ అన్నీ ఉచితమని, ఏ కోర్సులోనైనా చేరవచ్చునని చెబుతూ కరపత్రాలను పంచారు. కౌన్సెలింగ్ సమయంలో తమను సంప్రదిస్తే సలహాలిస్తామని అన్నారు. ఫలితాలు రాకనే ఈ గోల ఏమిటని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. 'చేరేదాకా ఉచితం అంటారు. ఆ తరువాత సాకులు చెప్పి డబ్బులు గుంజుతారు..' అని విమర్శించారు.


మా రూం ఎక్కడబ్బా..?


విద్యార్థులకు పెన్సిల్స్ అందజేస్తున్న కానిస్టేబుల్ లింగ


పరుగులు పెడుతున్న విద్యార్థులు


బయట తల్లిదండ్రుల నిరీక్షణ

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తాను మరణించినా మరో ఇద్దరికి చూపును ఇచ్చాడు పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన పామిశెట్టి గోపాల్(61). ఈయన గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విశ్వదీపసేవాసంఘం వారు గోపాల్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అనుమతితో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రిట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పామిశెట్టి గోపాల్ నేత్రాలను సేకరించారు. నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలిగిందని సేవా సంసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో విశ్వదీపసేవాసంఘం వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఖమ్మం మాధవ, జూజురు రఘు, కేశవరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు కొత్తగేట్లు అమర్చాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

అనంతపురం విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆనకట్టకు యుద్ధ ప్రాతిపదికన కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గసభ్యుడు నారాయణస్వామి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్ మాట్లాడుతూ గత ఏడాది తుంగభద్ర ఆనకట్ట 19వ గేటు కొట్టుకుపోయిందన్నారు. డ్యాం 33 గేట్లు శిథిలావస్థకు చేరాయని అప్పుడే నిపుణులు గుర్తించారన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు కన్నయ్య నాయుడు కూడా డ్యాం గేట్లు వెంటనే మార్చాలని తుంగభద్ర బోర్డుకు నివేదిక ఇచ్చారన్నారు. కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు అత్యంత కీలకమైన డ్యాం విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయకార్యదర్శులు మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవప్ప, శ్రీరాములు, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, నాగార్జున, వీరభద్రస్వామి, సంతోష్, కుళ్లాయిస్వామి, నాగరాజు, పెద్దయ్య, చిన్నప్ప యాదవ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

నిధులు వచ్చేశాయ్

వివిధ సామాజిక వర్గాల భవనాలకు రూ3.20 కోట్లు జమ

ఉరవకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఏడాది కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉరవకొండలో కొన్నేళ్లుగా ఆగిపోయిన పనులకు మోక్షం లభించనుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవచూపి, 10 సామాజిక వర్గాలకు చెందిన భవనాలు, కల్యాణ మండపాల నిర్మాణానికి రూ.3.20కోట్లు విడుదల చేయించారు. ఆ నిధులు పది రోజుల కిందట పంచాయతీ ఖాతాల్లోకి జమ అయినట్లు తెలిసింది. దీంతో ఆగిపోయిన నిర్మాణాలు పూర్తి కావడానికి మార్గం ఏర్పడింది. 2019లో టీడీపీ హయాంలో రూ.40లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మారిపోవడంతో అది మొండి గోడలకే పరిమితమైంది. దానిని వైసీపీ ఐదేళ్లు ప్రచారం కోసం వాడుకుంది తప్పా, ఎలాంటి పనులూ చేపట్టలేదు. తాజాగా నిధులు మంజూరు కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆగిపోయిన షాదీఖానా

సామాజిక భవనం	మంజూరైన నిధులు (రూ.లక్షలో)
వాల్మీకి కల్యాణమండపం	50
కురుబ కల్యాణమండపం	50
ముస్లింల షాదీఖానా	50
నాయిబ్రహ్మణ కమ్యూనిటీ భవనం	30
భద్రావతి, భావనారుషీంద్ర భవనం	30
కృష్ణదేవరాయల కల్యాణమండపం	20
ఎస్సీ సామాజిక వర్గం భవనం	25
ఎస్సీ సామాజిక వర్గం భవనం(మాల)	25
కార్పెంటర్ల షెడ్	25
యాదవ కమ్యూనిటీ హాల్	15

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కాశీనాథుని నాగేశ్వరరావు (జయంతి)



'కళాప్రపూర్ణ' కాశీనాథుని నాగేశ్వరరావు 1867 మే 1న కృష్ణా జిల్లా ఎలకుర్రులో జన్మించారు. తెలుగుజాతికి, తెలుగుభాషకు, తెలుగు సంస్కృతికి ఆయన చేసిన సేవలు అపారం. పాత్రికేయుడు, వ్యాపారవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు, గ్రంథాలయాల విస్తరణకు కృషి చేసిన విద్యావేత్త, దానశీలి, ఖాదీ ఉద్యమాన్ని ప్రోత్సహించిన నాయకుడు. 1929లో ఏర్పాటైన ఆంధ్రనాటక కళా పరిషత్ సంస్థాపకులలో ఒకరు. ఆంధ్రపత్రిక, అమృతాంజనం సంస్థలను స్థాపించారు. 'నాగేశ్వరరావు పంతులు'గా పిలవబడ్డారు. 'దేశోద్ధారక', 'విశ్వదాత' అనే గౌరవాలు అందు కున్నారు. 1938 ఏప్రిల్ 11న కన్నుమూశారు.

పుచ్చలపల్లి సుందరయ్య (జయంతి)



కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య 1913 మే 1న నెల్లూరు జిల్లాలో భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరు. కుల వ్యవస్థను నిరసిస్తూ తన పేరు సుందర రామిరెడ్డిలోని 'రెడ్డి'ని తొలగించుకున్నారు. సహచరులు కామ్రేడ్ పీఎస్ అని పిలిచేవారు. సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగా కొనసాగినా నిరాడంబరంగా, ఆదర్శజీవితం గడిపారు. 1985 మే 19న కన్నుమూశారు.

బాల్‌రాజ్ సాహ్ని (జయంతి)




'పద్మశ్రీ' గ్రహీత బాల్‌రాజ్ సాహ్ని 1913 మే 1న పంజాబ్ రాష్ట్రం రావల్పిండిలో జన్మించారు. రంగస్థల నటుడిగా, సినీ నటుడిగాను పేరొందారు. బెంగాల్ శాంతి నికేతన్‌లోని విశ్వభారతి యూనివర్సిటీలో ఆంగ్ల, హిందీ ఉపాధ్యాయుడిగా పని చేశారు. బీబీసీ లండన్‌కు రేడియో వ్యాఖ్యాతగా వ్యవహరించారు. 'ఇన్‌సాఫ్' సినిమాతో కెరీర్ ప్రారంభించి రాణించారు. పంజాబీ సాహిత్యంలోనూ గుర్తింపు పొందారు. ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) కు తొలి అధ్యక్షుడు. అరవయ్యో యేట 1973 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

మన్నాడే (జయంతి)



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మన్నాడే 1919 మే 1న కోల్కత్తాలో జన్మించారు. ఆయన అసలు పేరు ప్రబోధ్ చంద్ర డే. రంగస్థలంపై 'మన్నాడే'గా పేరొందారు. నేపథ్య గాయకుడిగా, సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందారు. శాస్త్రీయ సంగీతంలో 'భేండి బజార్ ఘరానా'లో రాణించారు. హిందీ సినీరంగంలో 4వేలకుపైగా పాటలతో తనదైన రికార్డు సృష్టించారు. పలు ప్రాంతీయ భాషలలో పాటలు పాడారు. 'పద్మశ్రీ', 'పద్మభూషణ్', పద్మ విభూషణ్ తదితర అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. 2013 అక్టోబరు 24న కన్నుమూశారు.

మల్లాది సూరిబాబు (పుట్టినరోజు)



మల్లాది సూరిబాబు 1945 మే 1న విజయవాడలో జన్మించారు. కర్ణాటక సంగీత గాయకుడు, కళాకారుడు. ఆలిండియా రేడియోలో చిన్నపిల్లల సంగీత కార్యక్రమాలతో శ్రోతలను అలరించారు. ప్రోగ్రామ్ అనౌన్సర్‌గా 35ఏళ్లపాటు పని చేశారు. ఆయన ఆధ్వర్యంలోని భక్తిరంజని, సంగీత శిక్షణ కార్యక్రమాలు ఎంతో పేరొందాయి. దేశ విదేశాలలో సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2,500 కుపైగా పాటలకు స్వరకల్పన చేశారు. లలిత సంగీతాన్ని కూడా శాస్త్రీయ సంగీతానికి జోడించి చక్కని ప్రయోగాలు చేసి ఆకాశవాణి ద్వారా శ్రోతలకు అందించారు. 'కళారత్న', సప్తగిరి సంగీత విద్వన్మణి, కళాప్రపూర్ణ తదితర పురస్కారాలు పొందారు.

అజిత్‌కుమార్ (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత అజిత్ కుమార్ 1971 మే 1న సికింద్రాబాద్‌లో జన్మించారు. తమిళ సినీ నటుడు. 50కుపైగా సినిమాలలో నటించారు. 4 విజయ్ అవార్డులు, 3 సినిమా ఎక్స్‌ప్రెస్ అవార్డులు, 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, 3 తమిళనాడు రాష్ట్ర సినీ అవార్డులు అందుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, ఆంగ్ల భాషలలో అనర్గళంగా మాట్లాడగలడు. అంతేకాక మోటార్ కార్ రేసర్‌గా రాణించారు. మలేషియా, జర్మనీ తదితర దేశాల రేసులలో పాల్గొని ఇంటర్నేషనల్ అరెనా, ఫార్ములా ఛాంపియన్‌షిప్ సాధించారు. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పైలట్‌టెస్ట్‌గా, యూఏవీ సిస్టమ్ అడ్వైజర్‌గా ఉన్నారు. కలైమామణి తదితర గౌరవాలు అందుకున్నారు.

అనుష్క శర్మ (పుట్టినరోజు)



అనుష్కశర్మ 1988 మే 1న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో జన్మించారు. సినీ నిర్మాత, అత్యధిక పారితోషికం అందుకుం టున్న నటిగా రాణించారు. ప్రత్యేకించి బాలీవుడ్‌లో పేరొందారు. పలు సంస్థల ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు. ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, ఇతర అవార్డులు పొం దారు. లింగ సమానత్వం, మూగ్రజీవుల హక్కులపై పోరాటం చేస్తున్నారు. క్రికెటర్ విరాట్ కోహ్లిని పెళ్లాడారు.

8 నుంచి ఎస్కేయూ పీజీ, బీటెక్ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి పీజీ, బీటెక్, ఎంసీఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. పీజీలోని ఆర్ట్స్ కోర్సుల నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు 13వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. బీటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ రెండో సెమిస్టర్ విద్యార్థులకు 22 వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంసీఏ విద్యార్థులకు ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.


బసవణ్ణ ఆశయాల కోసం పాటుపడదాం



బీజేపీ కార్యాలయంలో పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి



వచనజ్యోతి బళగ ఆధ్వర్యంలో బసవజయంతి



విధానసౌధ వద్ద బసవణ్ణ విగ్రహానికి సీఎం పుష్పాంజలి

ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవణ్ణ ఆశయాలకోసం అందరూ పాటుపడాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. బసవ సమితి ఆధ్వర్యంలో విశ్వగురు బసవణ్ణ జయంతి వేడుకలను బుధవారం సీఎం ప్రారంభించారు. బసవేశ్వర సర్కిల్‌లోని బసవణ్ణ విగ్రహానికి పూలమాల సమర్పించారు. అనంతరం విధానసౌధ ప్రాంగణంలోని బసవణ్ణ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, మంత్రి ఎంబీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగర్‌లో ర్యాలీ

వచనజ్యోతి బళగ ఆధ్వర్యంలో బసవణ్ణ జయంతి వేడుకలు సాగాయి. విజయనగర్‌లో బసవణ్ణ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. బసవణ్ణ వచనాలు, ఆశయాలను కొనియాడారు. డొళ్ళుకుణిత, కంసాలెతోపాటు పలు సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ అనిపించాయి. అక్కమహాదేవి మహిళాసంఘం సభ్యులు, వచనాల గాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వచన జ్యోతి బళగ అధ్యక్షులు పినాకపాణితోపాటు పలువురు స్వామీజీలు, లింగాయత ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వీరశైవలింగాయత అనుబంధ మఠాలలో ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి. తుమకూరు సిద్దగంగామఠంలో మఠాధిపతి డాక్టర్ సిద్దలింగస్వామిజీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మైసూరులోని సుత్తూరు మఠంలో శివరాత్రి దేశికేంద్ర స్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. ఉత్తర కర్ణాటక పరిధిలోని అన్ని గ్రామాల్లో బసవజయంతి వేడుకలు జరిగాయి.

నెలమంగలలో ఉత్సాహంగా జయంతి

నెలమంగలలోని బసవణ్ణ దేవరమఠ ఆధ్వర్యంలో బసవజయంతి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన మఠం భక్తులు, వీర శైవ లింగాయతులు భాగస్వామ్యులయ్యారు. మాగడి నియోజకవర్గం అదరంగిలో బసవణ్ణ ఊరేగింపు వేడుకలు జరిగాయి. ప్రాచీనమైన ఆలయంలో ప్రత్యేక పూజల తర్వాత వేడుకలు కొనసాగాయి.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో...

బెంగళూరు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బసవజయంతి వేడుకలు సంబరంగా సాగాయి. కన్నడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు అధ్యాపకులు శివప్రసాద్, రుద్రేశ్ అదరంగితో పాటు పలువురు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



విజయనగర్‌లో కాషాయజెండాలతో ర్యాలీ



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో...



విజయపురలో నగర్త యువజనసంఘం ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మానం...



అదరంగి గ్రామంలో ప్రత్యేక ఊరేగింపు ఇలా..

బసవణ్ణ మార్గం అనుసరణీయం



బంగారపేట తాలూకా కార్యాలయంలో బసవజయంతిలో తహసీల్దార్ తదితరులు



విజయపురలో ఒకే వేదికపై ప్రముఖుల చిత్రాలు

బంగారపేట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల్రకితమే సమాజంలో కుల, మత బేధం లేకుండా బసవణ్ణ ఆకాంక్షించారని అందుకే ఆయనను విశ్వగురుగా తహసీల్దార్ వెంకటేశప్ప పేర్కొన్నారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో బసవణ్ణ జయంతి బుధవారం నిర్వహించారు. బసవణ్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పన్నెండో శతాబ్దంలోనే సమాజ ఉద్ధరణకోసం బసవణ్ణ చొరవ చూపారన్నారు. ఆయన ఆదర్శాలు, ఆలోచనలు నేటికీ అనుసరణీయమన్నారు. బసవణ్ణ అనుభవ మంటపం అనేది అద్భుత పరికల్పన అన్నారు. తద్వారా అన్ని వర్గాలను ఒక చోటు చేర్చనున్నారన్నారు. దీన్నే ప్రపంచంలో తొలి పార్లమెంట్‌గా పిలుస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, అక్షరదాసోహ శాఖ యువరాజ్, దళిత ప్రముఖులు హుణసనహళ్ళి వెంకటేశ్, వీరశైవ లింగాయత ప్రముఖులు, తాలూకా పాలనా సిబ్బంది పాల్గొన్నారు.

శిడ్లఘట్టలో..

శిడ్లఘట్ట: అంబేడ్కర్ జయంతి రోజున ప్రధాని నరేంద్రమోదీని జ్ఞాపకం చేసు కోవాలని ఎమ్మెల్యే మేలూరు రవికుమార్ అభిప్రాయపడ్డారు. జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయంలో ఏర్పాటైన బసవజయంతి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ అనే ధ్యేయ వాక్యంతో కర్తవ్యం నిర్వహిస్తున్నారన్నారు. ఇది పన్నెండో శతాబ్దం నాటి మానవతావాది బసవేశ్వరుడి ఆశయమన్నారు. బసవేశ్వర సేవా సమితి, అభివృద్ధి ట్రస్టు అధ్యక్షుడు నందీశ్, వీరశైవ మహాసభ తాలూకా అధ్యక్షుడు బసవరాజు, దళిత ప్రముఖుడు మంజునాథ్, గ్రేడ్-2 తహసీల్దార్, పూర్ణిమ, ఈఓ హేమావతి, నగరసభ కమిషనర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముళబాగిలులో...

ముళబాగిలు: బసవణ్ణ తమ వచనాల ద్వారా మానవాళికి గొప్ప సందేశం ఇచ్చారని సమసమాజ నిర్మాణానికి ఎంతో శ్రమించారని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని వీరభద్రస్వామి దేవాలయం వద్ద బసవజయంతి సందర్భంగా ఏర్పాటైన పుష్పపల్లకీ ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. సామాజిక చైతన్యకారుడు బసవణ్ణ 12వ శతాబ్దంలోనే కులమత రహిత సమాజం కోసం కృషి చేశారన్నారు. బసవణ్ణ ఆశయాలు, ఆలోచనలు అన్ని కాలాలకు మాదిరిగా ఉంటాయన్నారు. వీరశైవలింగాయత యువ వేదిక అధ్యక్షుడు కిశోర్, న్యాయవాది రంజిత్ కుమార్, శివకుమార్, మహేశ్, సోమశేఖర్, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

శరణ దార్శనికుల భావచిత్రాల ఆవిష్కరణ

విజయపుర: ప్రతి ఒక్కరికి శరణల జీవనం, వారి వ్యక్తిత్వం గురించి తెలిసేలా జాతీయ బసవదళ కార్యదర్శి బేకరి శివణ్ణ స్వయంగా ప్రత్యేకంగా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. బసవజయంతి సందర్భంగా శరణ మార్గంలో కొనసాగిన మహనీయుల చిత్రపటాలను ఇందులో పొందుపరిచారు. విశ్వ గురు బసవణ్ణ, శూర్యపీఠం సింహాసనాధీశ్వరుడు అల్లమప్రభు, వీరగంటి మడివాళ మాచిదేవ, బహురూపి చౌడయ్య, శివయోగి సిద్దరామేశ్వర, హడపద అప్పణ్ణ, లింగమ్మ దంపతులు, అక్కమహాదేవి, అంబిగర చౌడయ్య, చెత్త ఊడ్చే శరణి సత్యక్క, దేవర దాసిమయ్య, చిన్మయజ్ఞాని చెన్న బసవణ్ణ, లింగాంగ యోగి సిద్దరామేశ్వర, వీరమాత అక్క నాగలింబికె తదితరుల చిత్రపటాలను ఒకేచోట వీక్షించేలా అవకాశం కల్పించడంపై ప్రజలు ప్రశంసించారు. కాగా నగర్త యువజనసంఘం ఆధ్వర్యంలో వివిధరంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు.



శిడ్లఘట్ట తాలూకాలో వేదికపై ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు



పల్లకి ఉత్సవంలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తదితరులు

వైభవంగా గంగమ్మదేవి జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ముళబాగిలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలపేటలో కొలువైన గ్రామదేవత గంగమ్మదేవి ఆలయ 23వ వార్షిక గంగ జాతర వైభవంగా జరిగింది. ప్రాణ ప్రతిష్ఠం చేసిన గంగమ్మదేవి శిరస్సుకు విశేషపూజలు నిర్వహించారు. మూల విరాట్టుకు అభిషేకం, అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన గంగమ్మదేవి శిరస్సుకు సుమంగళిలు తలపై దీపాలతో వచ్చి సమర్పించారు. కోలారు జిల్లాతోపాటు సరిహద్దు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఆలయాన్ని దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. వివిధ బృందాలు ఆలపించిని పాటలు అలరించాయి. గంగమాంబ యువజన సంఘం, ఇతర సేవాకర్తలు పలు రకాల ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 2,500, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు.

ఐసీఎస్ఈలో హోలి ఏంజెల్స్ వందశాతం ఉత్తీర్ణత

బెంగళూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని హోలి ఏంజెల్స్ హైస్కూల్‌లో ఐసీఎస్ఈ ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ పీ లోకేశ్ ప్రకటించారు. బుధవారం ఐసీఎస్ఈ ఫలితాలు వెలువడ్డాయి. చిన్మయి బి 96.4శాతం, పూర్ణిమా ఎస్ 96.4శాతం, ప్రతిష్ఠ డి పరమార్ 96శాతం, రచన ఆర్ 95శాతం ఉత్తీర్ణత సాధించారు. తర్వాతి స్థానాల్లో సైదా రావ్యా, వైష్ణవి బన్నూరు, రాజశ్రీలు నిలిచారు. ఐసీఎస్ఈలో వందశాతం ఫలితాల సాధనపై ప్రిన్సిపాల్ లోకేశ్, డైరెక్టర్ చంద్రమోహన్‌లు సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

మార్కెట్‌లోకి లాయిడ్ స్టైన్నర్ ఏసీ

బెంగళూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గృహోపకరణాలలో ప్రముఖమైన హావెల్స్ ఇండియా సంస్థ అన్ని వర్గాల వినియోగదారులకు అనుకూలంగా ఉండేలా లాయిడ్ బ్రాండ్ స్టైన్నర్ ఏసీని లాంఛనంగా విడుదల చేసింది. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, తమన్నాభాటియాలు బ్రాండ్ అంబాసిడర్‌లుగా నియమించినట్టు హావెల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ రోహిత్‌కపూర్ పేరిట బుధవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం 30 సెకండ్లలో 18 సెంటిగ్రేడ్‌లకు చేరుకుని చల్లటి ఆహ్లాదాన్ని కలిగిస్తుందని ప్రకటించారు.


బసవేశ్వరుడికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ మిశ్రా, ఎస్పీ శోభారాణి


పూజల్లో ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి కుటుంబ సభ్యులు


నివాళి అర్పిస్తున్న జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ


సిరుగుప్పలో ఊరేగింపులో లింగాయత్ ప్రముఖులు

మహా మానవతావాది బసవేశ్వరుడు

● తత్వ బోధనలతో చైతన్యం కలిగించిన సాహితీవేత్త: జయంతి వేడుకల్లో కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గొప్ప మానవతావాది, సాంస్కృతిక నాయకుడు బసవేశ్వరుడు అని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ అన్నారు. బుధవారం బసవేశ్వర జయంతిని ఉభయ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. బళ్లారి నగరంలోని హెచ్ఆర్ గవియప్ప సర్కిల్ సమీపంలోని బసవేశ్వర విగ్రహానికి జిల్లాయంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బసవేశ్వర విగ్రహానికి జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గొప్ప మానవతావాది బసవేశ్వరుడి విలువలు ,ఆలోచనలను ప్రతి ఒక్కరూ స్వీకరించాలన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి , జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహ్మద్ హారీస్, అదనపు జిల్లాకమిషనర్ మహమ్మద్ జుబేర్, హామీపథకాల అమలు అథారిటీ కమిటీ జిల్లాఅధ్యక్షుడు చిదానందప్ప, కన్నడ సాంస్కృతిక సహాయ సంచాలకులు బి.నాగరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జేడీఎస్ కార్యాలయంలో..

నగరంలోని జేడీఎస్ పార్టీ కార్యాలయంలో బసవన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ బసవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ బసవన్న 12 శతాబ్దంలోని వారు తత్వవేత్త, లింగాయత్ సమాజ స్థాపక గొప్ప సాదువు అని అన్నారు. బసవన్న త్రిమూర్తుల్లో అతి ముఖ్యమైన శివుడి గొప్ప భక్తుడని, ఏటా వైశాఖ మాసం మూడవ రోజున బసవన్న జయంతిని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. బవసన్న 1131లో ఆధునిక కర్ణాటకలోని బాగేవాడిలో జన్మించారు. సమాజ శ్రేయస్సు కోసం తనను తాను అంకితం చేసుకోవడం ద్వారా అనేక సంఘ వ్యతిరేక కార్యకలాపాలను ఆయన సవాలు చేశారన్నారు. భక్తి ద్వారా అధ్యాత్మిక జ్ఞానోదయాన్ని ప్రోత్సహించడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించాన్నారు. ఈసందర్భంగా హొన్నూర్‌స్వామి, అశోక్, యల్లనగౌడ్, చాగనూర్ నాగరాజు, కిరణ్‌కుమార్, బసవ, నాగరాజ, హొన్నూర్‌వలి, రాము, జేడీయస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్ప, భవాని, రాజమత్, రాజేశ్వరమ్మ, విజయ, రేష్మ, జయలక్ష్మి, రమాదేవి, బృందావని, ఆశ పాల్గొన్నారు.

అసమానతలను తొలగించిన జగజ్యోతి..

అంటరానితనం, మూడనమ్మకాలు ,లింగ అసమానతలను తొలగించడానికి విప్లవాత్మక అడుగు వేసిన వ్యక్తి జగజ్యోతి బసవన్న అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్ల గుర్కి అన్నారు. సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన విశ్వగురు బసవన్న సాంస్కృతిక నాయకుడి జయంతోత్సవ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. దొంగలించవద్దు, చంపవద్దు, అబద్ధం మాట్లాడవద్దు అనే ప్రమాణాలను పఠిస్తూ ఆయన బోధన కొనసాగించారన్నారు. 12వ శతాబ్దంలో ఆయన అన్ని కులాల శరణులను చేర్చి వారికి లింగాదీక్ష ఇచ్చి ప్రమాణాలు రాయడానికి ప్రేరేపించారన్నారు. ఆయన మాటలు ఆదర్శాలు నేటికి సందర్భోచితంగా ఉన్నాయి. కన్నడ నాడు, దేశ పురోగతికి బసవన్న సహకారం అపారమైంది. ఆయన దార్శనిక జీవితం మనందరికి ఆదర్శప్రాయం. ఈసందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప : తాలుకా వ్యాప్తంగా బసవేశ్వరస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆదోని రోడ్డు మార్గంలో నాగలింగేశ్వరాలయం నుంచి అమృతేశ్వర ఆలయం వరకు బసవన్న చిత్రపటాన్ని మేళతాళాలతో ఊరేగించారు. తహసీల్దార్ కార్యాలయంలో బసవన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం ప్రముఖులు బసలింగప్ప, శివప్ప, సిద్దలింగయ్యస్వామి, వీర శరణు బసప్ప, మల్లికార్జున, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు : కులం, మతం, లింగ వివక్షలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసిన క్రాంతియోగి బసవేశ్వరుడి ఆశయాలు అన్ని తరాలకు అనుసరణీయమని జిల్లా అధికారి నితీశ్ అన్నారు. బసవేశ్వరుడి 900వ జయంతి పురస్కరించుకుని నగరంలోని బసవేశ్వర సర్కిల్ క్రాంతియోగి బసవేశ్వరుడి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

నగరంలో..


వేడుకల్లో రాయచూరు ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు


రాయచూరులో బసవేశ్వరుడికి నివాళి అర్పిస్తున్న మంత్రి భోసరాజు


కంప్లిలో వీరశైవ లింగాయతుల ఆధ్వర్యంలో..


బళ్లారి ఊరేగింపులో లింగాయత్ నాయకులు


సంజీవరాయ పాఠశాలలో..


బసవేశ్వర విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాయచూరు డీసీ నితీశ్

బళ్లారిరూరల్ : నగరంలో బుధవారం బసవ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. వీరశైవ లింగాయత్ కుల బాంధవుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తాదులు వీరశైఎవ కుల బాంధవులు ర్యాలీను మున్సిపల్ గ్రౌండ్, రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు మీదుగా బ్రూస్‌పేట్ సర్కిల్, మోతి సర్కిల్ నగర వీధుల్లో బసవ ఉత్సవాన్ని కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. షాపుకారు సతీష్ బాబు, సిద్ధ, తిమ్మన్నగౌడ, రేణుక మల్లన్నగౌడ, ఎల్‌పీ మేటి పంపన్నగౌడ, కరవే రాజన్న, వీరశైఎవ లింగాయత్ యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కంప్లిలో..

కంప్లి : పట్టణంలో బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సమాజం అక్క మహాదేవి సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు చేపట్టారు.

వైభవంగా తురుముంది బసవేశ్వర రథోత్సవం

తాలుకా పరిధిలోని దేవసముద్రం గ్రామంలో బసవ జయంతి సందర్భంగా తురుముందు బసవేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథోత్సవం ఊరేగించారు. భక్తాదులు పూలు, పండ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు.


తురుముంది బసవేశ్వర రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఐసీఎస్‌ఈ పది ఫలితాల్లో ప్రతిభ చాటిన బెస్ట్ కళాశాల


నూతన్‌రెడ్డి, యోగీశ్వర్, అరశి, సంభ్రమ్, దిలీప్ కొట్లే, మహాలక్ష్మి, వైష్ణవి, పూజ, మయాంక్, ప్రీతి, తుప్పద తేజ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఈసంవత్సరం ఐసీఎస్‌ఈ పది ఫలితాల్లో బెస్ట్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించింది. పాఠశాలకు చెందిన కుమార్ నూతన్‌రెడ్డి అనేవిద్యార్థి 97.6(488/500) మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదేవిధంగా యోగీశ్వర్ 95.6, ఆరశి 94శాతం, సంభ్రమ్ 93. 4, దిలీప్ కొట్లే 93శాతం, మహాలక్ష్మి , వైష్ణవి 92.8శాతం, పూజ, మయాంక్ 92.6, ప్రీతి 92.4, తుప్పద తేజ 90.8, కిరణ్ నాగవర్మ 90.2, శాతం మార్కులు సాధించారని సంస్థ ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్‌కుమార్ తెలిపారు. పరీక్షకు హాజరైన మొత్తం 162 విద్యార్థుల్లో 85మంది విద్యార్థులు డిస్టింక్షన్, 54మంది విద్యార్థులు ప్రథమ, 14మంది విద్యార్థులు ద్వితీయ స్థానం, 8మంది విద్యార్థులు తృతీయస్థానంలో ఉత్తీర్ణులైయ్యారు, ఉత్తీర్ణులైన విద్యార్థులను సంస్థ అధ్యక్షుడు కోనంకిరామప్ప, ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీమతి రత్నకుమారి, ప్రిన్సిపాల్ లోకప్ప మైలాపూర్, ఉప ప్రిన్సిపాల్ జ్యోతి అమర్‌నాథ్, సిబ్బంది అభినందించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కంప్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని బల్లాపురం గ్రామంలో మంగళవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. స్వామికి ఆకుపూజ, అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఎమ్మిగనూరు వామదేవ శివాచార్యులు పాల్గొని పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఉదయం విగ్రహాన్ని భాజా భజంత్రీలు మధ్య ఊరేగించారు. బల్లాపురం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులను సమర్పించుకున్నారు.


అలకంరణలో హనుమంతుడు

పొగాకు రహిత జిల్లాగా మార్చాలి: ఏడీసీ


సెల్ఫీ బూత్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వినియోగం, అమ్మకం, దుర్వినియోగాన్ని నిర్మూలించడానికి,అందరమూ చేతులు కలపాలని జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ అన్నారు. బుధవారం నగరంలోని కోట ప్రాంతంలోని సంత్ జోసఫ్ హైస్కూల్ ఆవరణలో జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ , జిల్లా విద్య, అక్షరాస్యత శాఖ నిర్వహించిన పొగాకు రహిత జిల్లా కార్యక్రమంపై ఆయన మాట్లాడారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఏకకాలంలో అవగాహన ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని మొత్తం 1.265 ఉన్నత పాఠశాలలు 2లక్షలకు పైగా విద్యార్థులకు పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభవాల గురించి అవగాహన కల్పించామన్నారు. ఈసందర్భంగా అధికారులు, విద్యార్థులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పొగాకు నియంత్రణ సెల్ పోస్టర్లను విడుదల చేశారు. పొగాకు కాదు జీవితాన్ని ఎంచుకోండి. బళ్లారిని పొగాకు రహితజిల్లాగా చేద్దాం అనే నినాదంతో ప్రారంభించబడిన సెల్ఫీ బూత్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లా సర్వేయర్ డా.మరియంబి, పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, సెయింట్ జాన్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ ఫ్రాన్సిస్, శివానందరెడ్డి, డీపీఓ కొట్రేశ్, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్ప,జిల్లా పొగాకు నియంత్రణ విభాగం జిల్లాసలహాదారు ప్రశాంత్, సమాజిక కార్యకర్త సరస్వతి, మల్లేశప్ప పాల్గొన్నారు.

హోసూరు జోన్


సమావేశంలో మాట్లాడుతున్న అన్నాడీఎంకే నాయకులు పన్నీర్ సెల్వం

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

హోసూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రానున్న శాసనసభ ఎన్నికలకు ఇప్పటినుంచి పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. వేపనహళ్ళి నియోజకవర్గంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలసబాక్కంకు చెందిన పన్నీర్‌సెల్వం ప్రసంగిస్తూ అత్తిముగం, అంకొండపల్లి, చెట్టిపల్లి వెంకటేశపుర వంటి ప్రధాన పంచాయతీలలో బూత్‌కమిటీ సభ్యుల నియామకం చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో లక్ష ఓట్లు మెజారిటీ లక్ష్యమన్నారు. కృష్ణగిరి పశ్చిమజిల్లాకు చెందిన కీలకనాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, జిల్లాబూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. 2026 ఎన్నికల్లో ఎవరు పోటీ చేసినా గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

టైటాన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

హోసూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టైటాన్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్ లిమిటెడ్ సంస్థ, లయన్స్‌క్లబ్ ఆఫ్ హోసూరు ఎవరెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రఘుమాన్ నేతృత్వంలోని వైద్యబృందం పరీక్షలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటైన శిబిరంలో 210మందికిపైగా కంటి పరీక్షలు చేశారు. వీరిలో 72మందిని కోయంబత్తూరు అరవింద్ కంటి ఆసుపత్రికి ఉచిత శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి పీఆర్ఓ గోవిందరాజ్, డీల్ సంస్థ సామాజిక అభివృద్ధి బృందం సభ్యులు ప్రసాద్, పర్వతరాజ్, వినోద్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తగ్గిన పూల ధరలు - ఆందోళనలో రైతులు


వర్షంతో తడిసి ముద్దయిన పూలమార్కెట్

హోసూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో వివిధ రకాల పుష్పాలు సాగు చేస్తున్నారు. సీజన్‌లతో నిమిత్తం లేకుండా అన్ని కాలాల్లో ఇక్కడ పలు రకాల పూలు అందుబాటులో ఉంటాయి. రోజా పూలు ప్రధానంగా ఉండగా, కనకాంబరం, చెండుమల్లి, చేమంతి తదితర రకాలు ఉన్నాయి. పండుగలు, పర్వదినాలలో మంచి డిమాండ్ ఉండగా ఇతర రోజుల్లో సరైన ధరలు లేకపోవడంతో పూలరైతులు వాపోతున్నారు. వారంలో ఒకరోజు మంచి ధర ఉంటే మరో రోజు ధర ఉండడం లేదని పలువురు పూలసాగు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. గుండుమల్లి కిలో రూ.240 నుంచి 180కు తగ్గగా, సంపంగి రూ.50, చేమంతి రూ.100-120 మధ్య ధర పలికింది. ప్రతి రకం కిలోకు రూ.50-80 వరకు ధర తగ్గింది. ఇంత భారీ వ్యత్యాసం ఉండడంతో నష్టపోతున్నామని కనీస గిట్టుబాటు ధర కల్పించాలని పూలసాగు రైతులు కోరుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ) సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారికి పంచామృతాభిషేకం, దీక్షాహోమం, బలిహరణ, ఉదయం 10 గంటలకు రథాంగహోమం, బలి, పూర్వ వీధుల మడుగుతేరు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలను చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారిని పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించి స్వామివారి రథోత్సవంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి రథోత్సవమును ఆలయ కమిటీ సభ్యులు, యువకులు లాగారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన రహదారిపై స్వామివారి రథాన్ని ఊరేగించారు.


అశేష భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం

ఐజీపీ లోకేష్ కుమార్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు


లోకేష్ కుమార్ సన్మాన కార్యక్రమంలో ఎస్పీ శోభారాణి, ఏఎస్పీలు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఐజీపీ లోకేష్ కుమార్ రెడ్డిని పోలీసు అధికారులు ఘనంగా సత్కరించారు. ఐజీపీ పదవీ విరమణ సందర్భంగా నగరంలో పోలీసు క్రీడా భవనంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో బళ్లారి, విజయనగర, కొప్పాళ్ రాయచూరు నలుగురు ఎస్పీలతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పోలీసులు పాల్గొని గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి ఎస్పీ శోభారాణి, ఏఎస్పీలు నవీన్ కుమార్ రవికుమార్ డీఎస్పీలు చంద్రకాంతనందరెడ్డి, సంతోష్ చౌహాన్, వెంకటేష్‌తో పాటు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు వాసు కుమార్, రుద్రప్ప, హనుమంతప్ప, మహంతేష్, సుభాష్ చంద్ర, అయ్యన్నగౌడ పాటిల్ పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.